క్లుప్తంగా

పింఛన్ పంపిణీ కేంద్రం ప్రారంభం

రామాయంపేట(మెదక్): ప్రతీ నెలా మున్సిపాలిటీ పరిధిలోని కోమటిపల్లి గ్రామంలో పింఛన్లు పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు బుధవారం కేంద్రాన్ని జితేందర్‌గౌడ్ ప్రారంభించారు. పింఛన్ల కోసం ప్రతీ నెలా వృద్ధులు, దివ్యాంగులు, బీడీ కార్మికులు నాలుగైదు కిలో మీటర్ల మేర రామాయంపేటలోని పోస్టాఫీస్‌కు వస్తూ ఇబ్బందులపాలవుతున్నారు. ఈ విషయం చైర్మన్.. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, గ్రామంలో కేంద్రం ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకున్నారు. వచ్చేనెలా నుంచి కోమటిపల్లి, కోమటిపల్లి తండాకు చెందిన పింఛన్‌దారులు రామాయంపేటకు రావొద్దని, గ్రామంలోనే డబ్బులు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ సూచించారు. మున్సిపల్ కౌన్సిలర్ సుందర్ సింగ్, పోస్టాఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలను రక్షించాలి



నాటుతున్న మొక్కలను పరిశీలిస్తున్న ఏపీఓ

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి, బాధ్యతగా సంరక్షించాలని ఏపీఓ శ్యాం కుమార్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని ఫైజాబాద్ గ్రామంలో రోడ్డు ఇరు వైపులా నాటుతున్న మొక్కలను పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శి నాగరాజు, టీఏ హన్మంతు, ఫీల్డ్ అసిస్టెంట్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



నీటి గుంతలో ఆయిల్‌బాల్స్ వేస్తున్న దృశ్యం

నిజాంపేట(మెదక్): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని నందిగామ గ్రామ సర్పంచ్ ప్రీతి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో దోమల మందును పిచికారీ చేస్తున్నట్లు తెలిపారు. మురికి కాల్వల్లో బ్లీచింగ్ పౌడర్ వేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో ఆయిల్ బాల్స్‌ను వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ ఎంపీటీసీ సురేశ్, గ్రామ కార్యదర్శి ఆరిఫ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ



మొక్కలను పంపిణీ చేస్తున్న సర్పంచ్

టేక్మాల్(మెదక్): మండల కేంద్రం టేక్మాల్ సర్పంచ్ నాయికోటి సుప్రజా భాస్కర్ ఆధ్వర్యంలో బుధవారం పండ్ల, పూల మొక్కలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. ప్రభుత్వం చేపడుతున్న హరితహారంలో భాగంగా ఇంటింటికి ఐదు మొక్కలను నాటి వాటిని కాపాడాలని సూచించారు. ఇందులో ఏఎస్ఐ తుక్కయ్య, పంచాయతీ ఈఓ కమలాబాయి, వార్డు సభ్యులు కిషోర్, సల్లావుద్దీన్, గ్రామస్తులు ఉన్నారు.

కూలిన ఇళ్ల వివరాల సేకరణ

శివ్వంపేట(నర్సాపూర్): ఏకదాటిగా కురుస్తున్న వర్షాలకు గాను శిథిలావస్థకు చేరిన నివాస ఇళ్లు కూలిపోయాయి. బుధవారం రోజంతా మోస్తారు వర్షంతో పాటు ముసురు వర్షం కురిసింది. శిథిలావస్థకు చేరి కూలిన ఇళ్లను బుధవారం రెవెన్యూ సిబ్బంది పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ వివరాలను ఉన్నత అధికారులకు నివేదించనున్నట్లు మండల అధికారులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

రామాయంపేట(మెదక్): తమ సమస్యల సాధన కోసం పంచాయతీ కార్మికులు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈమేరకు వారు బుధవారం రామాయంపేటలో ఎంపీపీ కార్యాలయం ఎదుట బతుకమ్మ ఆడి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన తెలిపారు. 20 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం ఎంతమాత్రం పట్టించుకోవడంలేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బాలమణి ఆరోపించారు. ప్రభుత్వం స్పందించపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని కార్మికులు హెచ్చరించారు.

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె బుధవారం 21వ రోజు కొనసాగింది. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మె చేశారు. తమ న్యాయమైన పలు సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని పంచాయతీ కార్మికుల సంఘం మండలాధ్యక్షుడు శివశంకర్ అన్నారు.

నిధుల జాప్యంపై నిలదీత

కొడిపల్లి మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ రాజునాయక్

కౌడిపల్లి(నర్సాపూర్): పాఠశాలకు కిటికీలులేవు.. ప్రహారీ లేదు.. అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతులకు నిధులు ఎప్పుడు వస్తాయే చెప్పాలని మండలం సర్వసభ్య సమావేశంలో అధికారులను ప్రజా ప్రతినిధులు ప్రశ్నించారు. బుధవారం కౌడిపల్లి మండలం సర్వసభ్య సమావేశం ఎంపీపీ రాజునాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాగ్సాన్‌పల్లి సర్పంచ్ ఎల్లం మాట్లాడుతూ.. మన ఊరు – మనబడి కింద ఏయే పాఠశాలకు నిధులు మంజూరయ్యాయో చేప్పాలన్నారు. సమస్య ఉన్న పాఠశాలలకు నిధులు మంజూరు చేయలేదని, నాగ్సాన్‌పల్లి పాఠశాలలో కిటికీలు లేకపోవడంతో కోతులు వస్తున్నాయని దీంతో పిల్లలు భయపడుతున్నారన్నారు. సొంత డబ్బులతో డోర్లు బిగించామన్నారు. కిటికీలు, ప్రహారీ సైతం లేదన్నారు. నిధులు మంజూరులో వివక్ష చూపొద్దన్నారు.

ఎంఈఓ బుచ్యానాయక్ మాట్లాడుతూ.. మన ఊరు – మనబడి కింద మొదటి విడతగా 21 పాఠశాలలకు నిధులు మంజూరయ్యాయన్నారు. మిగతావి రెండో విడతలో మంజూరు అవుతాయన్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. రాజిపేట అంగన్‌వాడీ కేంద్రం మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ లింగం కోరారు. అనంతరం పీఆర్ ఏఈ ప్రభాకర్ మాట్లాడుతూ.. 11 గ్రామ పంచాయతీలకు గ్రామ పంచాయతీ భవనాలు మంజూరయ్యాయని తెలిపారు. కొత్తగా ఏర్పడ్డ నాగ్సాన్‌పల్లికి పంచాయతీ భవనం ఎందుకు మంజూరుకాలేదని సర్పంచ్ ఎల్లం ప్రశ్నించారు. తిమ్మాపూర్ పాఠశాల భూమి విషయంలో ఇబ్బందులు ఉన్నాయని ఎంపీటీసీ స్వప్నకిషోర్‌గౌడ్, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు రామాగౌడ్ తహసీల్దార్ కమలాద్రి దృష్టికి తీసుకొచ్చారు. కాగా భూమి విషయం కోర్టుకేసులో ఉందని జిల్లా కలెక్టర్‌కు విషయం చెప్పాలని తహసీల్దార్ సూచించారు. ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్లు శశికళ, లక్ష్మి మాట్లాడుతూ.. మండలంలోని రాజిపేట, మహ్మద్‌నగర్‌గేట్‌తండా, వెంకటాపూర్, సింగమ్రితండా, కౌడిపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాలు శిథిలావస్థలో ఉన్నాయని, అద్దెకు రూంలు కూడా దొరకడంలేదని సర్పంచ్‌లు స్పందించి వేరే గదులు ఏర్పాటు చేయాలని కోరారు. వర్షాకాలం సందర్భంగా పరిసరాలను శుభ్రం చేసుకోవాలని డాక్టర్ ఫెర్నాజ్ అన్నారు. జాజితండా సర్పంచ్ రమేశ్ మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీళ్లు వారంలో ఒకరోజు మాత్రమే వస్తున్నాయన్నారు. దీంతో పాటు వ్యవసాయం, పశువైద్యం, ఆర్టీసీ తదితర వివిధ శాఖల అధికారులు శాఖ పరమైన అంశాలను వివరించారు.

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి: ఎంపీపీ

అనంతరం ఎంపీపీ రాజునాయక్ మాట్లాడుతూ.. నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. పల్లె దవాఖానాలో వైద్యులు ఉండడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. జెడ్పీటీసీ కవిత మాట్లాడుతూ.. వర్షాలు ఎక్కువగా కురుస్తున్నందున జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కవితఅమర్‌సింగ్, ఎంపీడీఓ శ్రీనివా స్, ఎంఈఓ బుచ్యానాయక్, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు సారరామాగౌడ్, కోఆప్షన్ హైమద్, ఎంపీఓ కలీముల్ల తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం నారాయణఖేడ్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెద్దశంకరంపేట మండలం కమలాపూర్, గొట్టిముక్కుల, మాడ్వెట్‌పల్లి, బుజ్రాన్‌పల్లి తదితర గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం తహసీల్దార్ గ్రేస్‌బాయి, ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా, ఎంపీపీ జంగం శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో మండలంలోని అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించి పలు సూచనలందించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వేణుగోపాల్‌గౌడ్, సర్పంచ్‌లు కుంట్ల రాములు, జగన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మీరమేశ్, ఎంపీటీసీలు దత్తు, వీణ సుభాష్‌గౌడ్, స్వప్నరాజేశ్, అశోక్, శంకర్‌గౌడ్, విఠల్‌గౌడ్, పున్నయ్య, సూర్యప్రకాష్ తదితరులున్నారు.

పగిలిన పైప్‌లైన్‌కు మరమ్మతులు



పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): పగిలిపోయిన మంజీరా ప్రధాన హెచ్‌డీ పైప్‌లైన్‌కు బుధవారం సిబ్బంది మరమ్మతులు చేశారు. తూప్రాన్ – నర్సాపూర్ ప్రధాన రహదారి చండి సబ్‌స్టేషన్ సమీపంలో మంగళవారం ప్రధాన పైప్‌లైన్ పగిలిపోవడంతో 47 గ్రామాలకు బుధవారం నీటి సరఫరా నిలిచిపోయిన విషయం విధితమే. పగిలిన పైప్‌లైన్ మరమ్మతులను మంజీరా నీటి సరఫరా డీఈ ప్రవీణ్ దగ్గరుండి చేయించారు. దొంతిలో ఉన్న బీపీటీ ట్యాంకుకు నీటి సరఫరా చేసినట్లు గురువారం 47 గ్రామాలకు నీటి సరఫరా జరుగుతుందని చెప్పారు.

చెరువులకు జలకళ



అలుగులు పారుతున్న నర్సాపూర్ రాయరావు చెరువు



పెద్దశంకరంపేట(మెదక్): తిరుమలాపూర్ చెరువు వద్ద..

నర్సాపూర్: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు నర్సాపూర్ రాయరావు చెరువు అలుగులు పారుతోంది. బుధవారం ఉదయం నుంచి చెరువు అలుగుల మీదుగా నీరు పారడంతో పట్టణ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గంగమ్మతల్లికి పూజలు చేశారు.

పెద్దశంకరంపేట(మెదక్): కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో జళకలను సంతరించుకున్నాయి. పెద్దశంకరంపేట చెరువు, తిరుమలాపూర్, రామోజిపల్లి, బూర్గుపల్లి, కమలాపూర్ తదితర గ్రామాల్లో చెరువులు అలుగుదాటి ప్రవహిస్తున్నాయి. బుధవారం పేటలో 9.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

చిన్నశంకరంపేట(మెదక్): వారం రోజులుగా ఏకదాటిగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని పలు గ్రామాల చెరువులు అలుగు పారుతున్నాయి. మండలంలోని గజగట్లపల్లి గ్రామ చెరువు అలుగు పారడంతో గ్రామ సర్పంచ్ మీనా గంగమ్మకు పూజలు చేశారు.

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో మల్కా చెరువు, కుంటలు అలుగు పారుతున్నాయి. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు కూడా చెరువు దగ్గరకు వచ్చి సెల్ఫీలు తీసుకుంటున్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

చేగుంట(తూప్రాన్): గ్రామీణ పేదలకు చౌకగా స్వచ్ఛమైన నీటిని అందించేందుకు బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో ఉల్లితిమ్మాయిపల్లి గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎంపీపీ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్లాంట్ నిర్మాణదాత ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్ మాట్లాడుతూ... గ్రామీణ పేదలకు కేవలం రూ.5లకే ఒక క్యాను ఫిల్టర్ నీరు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్తమ్మ, వార్డు మెంబర్లు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

మండలంలో పీర్ల సందడి

పెద్దశంకరంపేట(మెదక్): పేట మండలంలో పీర్ల సందడి ప్రారంభమైంది. ఈ నెల 29న మొహర్రం(పీర్ల పండగ) సందర్భంగా ఆయా కూడళ్ల వద్ద పీర్లను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పీర్ల పండగకు ఆయా గ్రామాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎంపీటీసీ నిధులతో బోరు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని గజగట్లపల్లి గ్రామంలోని 6వ వార్డులో బుధవారం ఎంపీటీసీ నిధులతో వేయించిన బోరును ఎంపీపీ భాగ్యలక్ష్మి ప్రారంభించారు. మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు ఎంపీటీసీ ప్రసాద్‌గౌడ్ నిధులతో బోరు వేసి, మోటార్ ఏర్పాటు చేసి ప్రారంభించారు. వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీ ప్రసాద్‌గౌడ్, సర్పంచ్ మీనా, గోపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ యాదగిరి ఉన్నారు.

మండుతున్న కూరగాయాల ధరలు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో బుధవారం జరిగిన వారంతపు సంత(అంగడి)లో కిలో టామాటా ధర రూ.120 నుంచి 160 పలకగా, కిలో బీరకాయ, కాకరకాయ ధర రూ. 100 పలికింది. చిక్కుడు కాయ, దొండకాయ, పచ్చిమిర్చి ధర కిలోకు రూ. 80 ఉంది.

గౌతోజీగూడెంలో హరితహారం

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని గౌతోజీగూడెం గ్రామంలో బుధవారం గ్రామస్తులు హరితహారం మొక్కలు నాటారు. ఉప సర్పంచ్ రేణుకుమార్, కార్యదర్శి నందిని, గ్రామస్తులున్నారు.

చెరువుకు గండి

వెల్దుర్తి(తూప్రాన్): కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో బండపోసాన్‌పల్లి బషీర్ చెరువుకు గండి పడిందని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి గౌరి అన్నారు. వెల్దుర్తిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత ఏడాది వర్షాకాలంలో చెరువుకు గండిపడి నీరు పోతే మరమ్మతు కోసం రూ.20 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. కాంట్రాక్టర్ నాణ్యత లేని పని చేయడంతో గండి పడిందని, సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

డిజిటల్ ఐడీ కార్డులపై అవగాహన



మాట్లాడుతున్న మత్స్యశాఖ జూనియర్ అసిస్టెంట్ బాలాజీ

కౌడిపల్లి(నర్సాపూర్): మత్స్య సహకార సంఘం సభ్యులకు ప్రభుత్వం నూతనంగా డిజిటల్ ఐడీ కార్డులు అందించనుందని దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస్, మత్స్యశాఖ జూనియర్ అసిస్టెంట్ బాలాజీ తెలిపారు. బుధవారం కౌడిపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని 17 మత్స్య సహకార సంఘం చైర్మన్‌లు, పంచాయతీ కార్యదర్శులతో డిజిటల్ ఐడీ కార్డులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ జూనియర్ అసిస్టెంట్ మాట్లాడుతూ.. మత్స్యకారులు రిజిస్ట్రేషన్ నంబర్, ఆధార్‌కార్డు, ఫొటో ఇతర పూర్తి వివరాలతో సొసైటీ తరపున డీటీపీ చేసి ఇవ్వడంతో పాటు మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులను గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పరిశీలించారు. అనంతరం కలెక్టర్ డిజిటల్ కార్డులు మంజూరు చేసి పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజునాయక్, ఎంపీఓ కలీముల్ల, ఏపీఓ పుణ్యదాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లోకి కిసాన్ సమ్మాన్ నిధి డబ్బులు

చేగుంట(తూప్రాన్): రైతుల ఖాతాల్లోకి కిసాన్ సమ్మాన్ నిధి డబ్బులను గురువారం బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నట్లు బీజేపీ మండలాధ్యక్షుడు భూపాల్ తెలిపారు.

నామినీ వివరాలు సరిచేసుకోవాలి



ఏఈఓకు రైతుబీమా దరఖాస్తు చేస్తున్న దృశ్యం

కౌడిపల్లి(నర్సాపూర్): రైతుబీమా దరఖాస్తులతో పాటు నామినీ వివరాలను మార్పులు, చేర్పులుంటే ఈనెల చివరి వరకు దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. బుధవారం కౌడిపల్లి డివిజన్ కార్యాలయంలో వ్యవసాయ అధికారులు రైతుబీమా దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుబీమా దరఖాస్తులతో పాటు నామినీ వివరాల మార్పు లేదా నామినీ చనిపోయనట్లయితే మార్చుకోవాలని తెలిపారు. ఆధార్ కార్డుల్లో మార్పులు జరిగినా సవరణకు ఏఈఓల వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ దివ్యశ్రీ, ఆత్మ ఏటీఎం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

వరిసాగులో యాజమాన్య పద్ధతులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు వరి సాగులో ప్రస్తుత పరిస్థితులకు తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే పంట బాగుండంతో పాటు, అధిక దిగుబడి సాధించవచ్చని ఏఈఓ భూపాల్ అన్నారు. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ.. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి పంట సాగుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా మారాయన్నారు. ఇదివరకే నార్లు వేసుకున్న రైతులు నాట్లు పూర్తి చేసుకోవాలని, ఇప్పటివరకు నార్లు మొదలుపెట్టని రైతులు దమ్ముచేసిన పొలాల్లో స్వల్పకాలిక రకాల విత్తనాలు నేరుగా వెదజల్లుకోవాలన్నారు. పంటలో భవిష్యత్‌లో ఉల్లికోడు, మోగి పురుగు తాకిడి తగ్గించకోవడానికి నారు తీయడానికి వారం రోజుల ముందుగా ఎకరాకు సరిపోయే నారుమడిలో 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలను చల్లుకోవాలని సూచించారు.

పత్తిలో నీరు నిల్వకుండా చూసుకోవాలి



పత్తిపంటను పరిశీలిస్తున్న ఏడీఏ రాంప్రసాద్

టేక్మాల్(మెదక్): పత్తి పంటలో నీరు నిల్వలేకుండా చూసుకుంటనే ఎదుగుతుందని పెద్దశంకరంపేట ఇన్‌చార్జ్ ఏడీఏ రాం ప్రసాద్ తెలిపారు. బుధవారం టేక్మాల్ మండలంలోని కుసంగి గ్రామంలో పత్తిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కురుస్తున్న వర్షాల కారణంగా పత్తిలో నిలిచిన నీటిని సాధ్యమైనంత తీసివేయాలన్నారు. అధిక వర్షాలకు లేత పసుపు రంగుకు మారిన మొక్కలను పోషకాలను ఆకుల ద్వారా 5 -10 గ్రాములు లీటరు నీటికి మొక్క వయసును బట్టి పొటాషియం నైట్రేట్ పిచికారీ చేసినట్లయితే మొక్కలు సాధారణ స్థాయికి చేరుతాయన్నారు. వ్యవసాయాధికారుల సూచనలతోనే రైతులు పంటల సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం సీఈఓ డాకూరి వెంకటేశం తదితరులు ఉన్నారు.

రేగోడ్(మెదక్): అధిక వర్షాలకు పత్తిలో నిలిచిన నీటిని సాధ్యమైనంత త్వరగా తీసేయాలని ఏఓ జావిద్ తెలిపారు. రేగోడ్‌లో బుధవారం పత్తిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీలైనంత త్వరగా భూమిలో తేమను తగ్గించటానికి అంతర కృషి చేయాలని చెప్పారు.

కొత్తది బిగించరు.. డీజిల్ ఆదా చేయరు



బ్యాటరీ చోరీకి గురైన ట్రాక్టర్ ఇదే

మెదక్ మున్సిపాలిటీ: మున్సిపల్ చెత్త సేకరణ ట్రాక్టర్ బ్యాటరీని గుర్తు తెలియని దుండగులు దొంగిలించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రతి రోజు పట్టణంలో తడి, పొడి చెత్త నిర్వహణకు వినియోగించే ట్రాక్టర్లు, ఆటోలను పని ముగిసిన వెంటనే బూస్టర్ పంపు వద్ద పార్కింగ్ చేసి డ్రైవర్లు వెళ్లిపోతారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అక్కడ మున్సిపల్ సిబ్బంది ఉండి పర్యవేక్షిస్తారు. వీటిపై నిఘా ఉంచేందుకు అధికారులు సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేశారు. అయితే కొన్ని రోజులుగా సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. దీంతో విలువైన వాహనాలను పార్కింగ్ చేసి వెళ్లిన క్రమంలో గుర్తు తెలియని దుండగులు ట్రాక్టర్ బ్యాటరీ దొంగిలించారు. అధికారులు ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా జాగ్రత్త పడినట్టు తెలిసింది. ఇప్పటివరకు పోలీసులకు సైతం ఫిర్యాదు చేయలేదు. అయితే పోయిన బ్యాటరీ స్థానంలో కొత్త దానిని ఏర్పాటు చేయలేదు. ఉదయం 5 గంటలకు పారిశుద్య కార్మికులు వచ్చి ట్రాక్టర్‌ను తోసి ఇంజన్ స్టార్ట్ చేస్తున్నారు. స్టార్ట్ అయినప్పటి నుంచి మధ్యాహ్నం వరకు ఇంజన్‌ను రన్నింగ్‌లోనే ఉంచుతున్నారు. దీంతో డీజిల్ వృథా అవుతుంది. కొత్త బ్యాటరీ ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. ఇదే విషయమై ఇంచార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆరా తీయగా ట్రాక్టర్ బ్యాటరీ చోరీకి గురైన మాట వాస్తవమేనని.. సీసీ కెమెరాను పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కొత్త బ్యాటరీని సైతం అమరుస్తామని చెప్పారు.

బటర్ ఫ్లై లైట్ల ఏర్పాటుకు నిధులు

శివ్వంపేట(నర్సాపూర్): బటర్ ఫ్లై లైట్ల ఏర్పాటుకు రూ.20లక్షలు మంజూరైనట్లు జెడ్పీటీసీ మహేశ్ గుప్తా తెలిపారు. తూప్రాన్ – నర్సాపూర్ హైవే శివ్వంపేట ప్రధాన రోడ్డు డివైడర్ వద్ద ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పీఆర్ ఏఈ భాస్కర్‌రావుతో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, పోచగౌడ్, కొండల్, దావుద్, వెంకటేశ్, ఖాదీర్ ఉన్నారు.

31 వరకు ఇంటర్ అడ్మిషన్లు

పెద్దశంకరంపేట(మెదక్): ఈనెల 31 వరకు ఇంటర్మీడియెట్‌లో అడ్మిషన్లకు అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అవనీష్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31 వరకు ఎలాంటి అడ్మిషన్ ఫీజు ఉండదని, ఆగస్టు 1 నుంచి 16 వరకు లేట్ ఫీజ్ రూ.500 ఉంటుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **సన్మానం**



శివ్వంపేట(నర్సాపూర్): అదనపు కలెక్టర్ రమేశ్‌ను బుధవారం ఎంపీడీఓల సంఘం నేతలు కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఎంపీడీఓల సంఘం అధ్యక్షుడు నవీన్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లాలోని పలువులు ఎంపీడీఓలు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఉమా, సభ్యులు శ్రీరామ్, గణేశ్ రెడ్డి, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

◆ **భూ విరాళం**

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని లచ్చిరెడ్డిగూడం గ్రామ పంచాయతీ నిర్మాణానికి దాత భూమి విరాళం ఇచ్చారు. నూతనంగా ఏర్పడిన పంచాయతీకి సొంత భవనం నిర్మాణానికి ప్రభుత్వ భూమి లేదు. దీంతో గ్రామ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి చొరవతో గ్రామానికి చెందిన రాంపల్లి రాంరెడ్డి ఆధీనంలో ఉన్న రెండు గుంటల గ్రామ కంఠం భూమిని విరాళంగా ఇచ్చేందుకు ముందుకొచ్చారు. ఈ సందర్భంగా బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్ చారి, ఆర్ఐ కిషన్, ఎంపీఓ తిరుపతిరెడ్డిలు స్థలదాతను సన్మానించారు.

◆ **'మార్కెట్ కమిటీ పదవి శివకుమార్‌కు ఇవ్వాలి'**

నర్సాపూర్: నర్సాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ శివకుమార్‌కు ఇవ్వాలని పలువురు నాయకులు బుధవారం ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో శివకుమార్, మండలాధ్యక్షుడు శేఖర్, పట్టణాధ్యక్షుడు భిక్షపతి, సర్పంచ్‌లు శ్రీరాములు, సామ్యానాయక్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

◆ **ఆర్థికసాయం**

శివ్వంపేట(నర్సాపూర్): ప్రమాదవశాత్తు మృతిచెందిన బాధిత కుటుంబానికి తోటి స్నేహితులు బుధవారం ఆర్థికసాయం అందజేశారు. ఐదు రోజుల క్రితం మండల పరిధిలోని కొంతన్‌పల్లి గ్రామానికి చెందిన రైతు బంజా రమేశ్ పై నుంచి కేజీవీల్ ట్రాక్టర్ పోవడంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి ఆదుకునేందుకు తోటి స్నేహితులు రూ. 13,500 అందజేశారు.

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని రజాక్‌పల్లి గ్రామానికి చెందిన మృతుడి కుటుంబానికి జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ సన్నిహితుల ద్వారా ఆర్థిక సాయం అందజేశారు. ఈ మేరకు బుదవారం మండలంలోని రజాక్‌పల్లి గ్రామానికి చెందిన రేగుల పరశురాములు(38) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి మండల జెడ్పీటీసీ రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు ధర్మా నాగరాజు, కొండల్, ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు గరుగుల శ్రీనివాస్, జీవన్ పాల్గొన్నారు.

◆ **అభివృద్ధిలో వెనుకబడిన నర్సాపూర్**

నర్సాపూర్: బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక నర్సాపూర్ అభివృద్ధిలో వెనకపడిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకటరమణరావు ఆరోపించారు. ఆయన బుధవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. వందల మంది బలిదానాలతో ఏర్పడిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో నర్సాపూర్ అభివృద్ధిలో వెనకపడడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన మదన్‌రెడ్డి చేసిందేమి లేదని ఆరోపించారు. వచ్చే ఎన్నికలలో బీసీలకు మద్దతు ఇవ్వాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు కృష్ణ, సంతోష్, ప్రవీణ్, కుమార్, వీరేశం పాల్గొన్నారు.

◆ **పరామర్శ**

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి రాజిరెడ్డి బాధిత కటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. పెద్దమ్మగడ్డ తండాలో, జలాల్‌పూర్ తండాలో, దామరంచలో ఇటీవ ల మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామా ల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని గౌతోజీగూడెం గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్లు కొన్ని రోజులుగా అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను శివ్వంపేట జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు.